## క్లుప్తంగా

### పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



**ఆర్మూర్‌టౌన్:** పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆర్యోగాన్ని కాపాడుకోవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి మంగళవారం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగ 135మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆయేషా, డాక్టర్ మానస, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలి



**రుద్రూర్:** తమ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం మోస్రా మండల పరిషత్ కార్యాలయానికి తరలివచ్చారు. పని ప్రదేశంలో సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నామని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పనికి రానట్టయితే జాబ్‌కార్డు తీసివేస్తామని చెప్పడం వల్ల ఎండలో సైతం పని చేస్తున్నామని, అయినా గిట్టుబాటు కూలీ రావడం లేదని వాపోయారు. అనంతరం రైతు వేదికలో ఉన్న మండల ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

### వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



**మాక్లూర్:** నిజామాబాద్‌లో ఈనెల 16 జరిగే బహుజన విద్యావంతుల వేదిక సభ కార్యక్రమ వాల్‌పోస్టర్లను మంగళవారం మండలంలోని వల్లభాపూర్‌లో సభ్యులు ఆవిష్కరించారు. వేదిక జిల్లా కార్యదర్శి సురేష్ కావళ్ల మాట్లాడుతూ.. ఈనెల 16న నిజామాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి బహుజన మేధావులు, విద్యావేత్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సురేష్ కావళ్ల విజ్ఞప్తి చేశారు. నాయకులు గైని ఆనంద్, పి సాయిలు, ప్రహ్లాద్, సవజీవ్, గైని గంగాధర్, రవిలు పాల్గొన్నారు.

### పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**నవీపేట:** హనుమాన్ జయంతి, రంజాన్ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై రాజారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవాలని సూచించారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్, శాంతి కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### బియ్యం వితరణ



**నవీపేట:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాలకు ఎమ్మెల్యే షకీల్ మంగళవారం బియ్యం వితరణ చేశారు. హనుమాన్ ఆలయాల్లోని హనుమాన్ స్వాములకు బీఆర్ఎస్ మండల నాయకులు ఈ బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల నాయకులు నర్సింగ్‌రావ్, తెడ్డు పోశెట్టి, సూరిబాబు, బుచ్చన్న, లోకం నర్సయ్య, డాంగె సతీష్, గైని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు శిబిరం ప్రారంభం



**రుద్రూర్:** మండలంలోని సులేమాన్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్ ప్రారంభించారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. సర్పంచ్ షేక్ ఖాదర్, మండల కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, దస్తగిరి, జీపీ కార్యదర్శి మహ్మద్ సోఫి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# తీరనున్న రహదారి కష్టాలు

- వేల్పూర్ మండలంలో డబుల్‌రోడ్లకు నిధులు మంజూరు
- విస్తరణ పనులకు నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



డబుల్‌రోడ్డుగా మారనున్న జాన్కంపేట్ నుంచి వేల్పూర్ వెళ్లే రహదారి

**వేల్పూర్:** వేల్పూర్ మండల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయి. మండలంలోని పలు గ్రామాల సింగిల్ రోడ్లు, డబుల్‌లైన్ రోడ్లుగా మారనున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. బుధవారం డబుల్ రోడ్ల పనులకు ఆర్అండ్‌బీ, గృహనిర్మాణశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

**రూ.36 కోట్ల నిధులతో పనులు..**

జాతీయ రహదారి 44 నుంచి జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ, బ్రాహ్మణపల్లి, వేల్పూర్ మండలం జాన్కంపేట్, సాహెబ్‌పేట్ గ్రామాల మీదుగా వేల్పూర్ దాకా 14 కిలోమీటర్ల దూరానికి రూ. 21 కోట్లు, 63వ నంబరు జాతీయ రహదారి నుంచి కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాల మీదుగా వేల్పూర్ వరకు ఉన్న 9 కిలోమీటర్ల రహదారికి రూ. 15 కోట్ల రూపాయలను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించారు. ఈ రహదారులు డబుల్‌రోడ్లుగా మారడం వల్ల ప్రయాణ సౌకర్యాలు పూర్తిగా మెరుగవుతాయి. జక్రాన్‌పల్లి, వేల్పూర్, మోర్తాడ్ మండలాల ప్రజలు ఇక్కడి వారు అటువైపు, అక్కడి వారు ఇటువైపు వెళ్లడానికి మార్గం సులభమవుతుంది. వేల్పూర్ మండల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లడానికి సౌకర్యం మెరుగవుతుంది. వ్యవసాయ అవసరాల కోసం వాహనాలు అధికంగా ఉపయోగించడం, పెరిగిన జనాభాతో రద్దీ పెరగడం వల్ల రహదారులు ఇరుకుగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లే రహదారులను డబుల్‌రోడ్లుగా మారుస్తూ వస్తోంది. అందులో భాగంగా మండలంలో అయిదు గ్రామాల రోడ్లు డబుల్‌రోడ్లుగా మారనుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పనులను నాణ్యతగా, సకాలంలో పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

**రాకపోకలు సులభతరం..**



జాన్కంపేట్ నుంచి వేల్పూర్ వెళ్లడానికి సుమారు 7 కిలోమీటర్ల దూరముంటుంది. ఇదే రహదారి వెంట జక్రాన్‌పల్లి మండల ప్రజలు కూడా వేల్పూర్ వైపు వెళ్తుంటారు. డబుల్ రోడ్డుతో రాకపోకలు సులభతరంగా మారనున్నాయి. మంత్రికి రుణపడి ఉంటాం.

–సౌద రమేశ్, ఉపసర్పంచ్, జాన్కంపేట్

**కలలో కూడా ఊహించలేదు..**



మండలంలో లోపలి గ్రామాలుగా ఉన్న కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాలకు డబుల్‌రోడ్డు నిర్మాణం అవుతుందని కలలో కూడా అనుకోలేదు. మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల డబుల్‌రోడ్డు మంజూరైంది. మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు.

–భోజపల్లి సురేష్, వైస్ ఎంపీపీ, కుకునూర్

# ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధిస్తా

- మళ్లీ బీఆర్ఎస్ పార్టీదే విజయం
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

**పెర్కిట్(ఆర్మూర్):** రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో మంగళవారం 'నమస్తే చేపూర్ మీ కోసం మీ జీవన్‌రెడ్డి' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేపూర్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కేసీఆర్ జమానా అంటే అభివృద్ధికి నమూనా అనే విధంగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనంతరం మండల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పస్క నర్సయ్య, జెడ్పీటీసీ సంతోష్, సర్పంచ్ ఇందూర్ సాయన్న, ఎంపీటీసీ బాల నర్సయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

**మాక్లూర్:** మండలంలోని ఢీకంపల్లి ఎంపీటీసీ కాలగడ్డ గంగమణి దేవన్న కుమారుడు రజినికాంత్ (30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పరామర్శించారు. అమ్రాద్ విండో చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రజనీష్, ఎంపీపీ మాస్త ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

**మాక్లూర్ :** మండలంలో అవసరమైన చోట్ల రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని బోర్గాం(కె)లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమై పక్షం రోజులు అవుతుందన్నారు. ధాన్యం కల్లాలపై సిద్ధంగా ఉన్నందున అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కాంటాలు జరిపించాలన్నారు. ఈసారి వరి నాట్లు వేసినప్పటి నుంచి తెగుళ్లు వచ్చి రైతుల పెట్టుబడులు రెండింతలు పెరిగిందన్నారు.దీంతో రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు. అలాగే మాదాపూర్ చెరువు కింద సాగు చేసిన సుమారు 800 ఎకరాల వరి పంటలకు నీరందక ఎండిపోయో పరిస్థితి ఉన్నందున నిజాంసాగర్ నీటితో మాదాపూర్ చెరువును తక్షణ చర్యగా నింపి పంటలను కాపాడాలన్నారు.

# పది పరీక్షకేంద్రాల తనిఖీ





మాక్లూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు.. వర్నిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సు

**మాక్లూర్:** మాక్లూర్‌లోని పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఎంఈవో రాజ్ గంగారెడ్డి తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు తప్పవని హెచ్చరించారు. రెండో రోజు కూడా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

**వర్ని:** పదో తరగతి హిందీ పరీక్షకు వర్ని మండలంలో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో శాంతకుమారి వెల్లడించారు. మండలంలోని పరీక్ష కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు.

**విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు**

**వర్ని:** పదో తరగతి విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. మండలంలోని పాత వర్నిలో ఉన్న మహాత్మాగాంధీ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు, జాకోరాలో ఉన్న పరీక్ష కేంద్రం వరకు వెళ్లడానికి ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు కల్పించారు.

## ఆధ్యాత్మికం..

**హన్మాన్ ఆలయ బ్రహ్మోత్సవాలు**



**బోధన్‌టౌన్(బోధన్):** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మారుతి మందిరంలో మూడురోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్ తెలిపారు. మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. హనుమాన్ జయంతి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

**నేడు అరట్టు ఉత్సవం**

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో గల అయ్యప్ప ఆలయంలో బుధవారం అఖిల భారతీయ అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అరట్టు మహోత్సవం చేపడుతున్నట్లు సభ్యు లు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**రేపు నరేంద్రాచార్యజీ పాదుకా దర్శనం**

**బోధన్:** సాలూర మండలంలోని హున్సా గ్రామంలో 6న మహారాష్ట్ర ప్రాంతంలోని ప్రముఖ జగద్గురు రామానందచార్య దక్షిణపీఠం నానీజ్‌ధామ్ పీఠాధిపతి స్వామి నరేంద్రాచార్యజీ మహారాజ్ పాదుకా దర్శనం, గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు.

# విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మదహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

**ఆర్మూర్‌టౌన్:** పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి వెంటనే విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని, ప్రశ్నాపత్రాలను లీకేజ్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భద్రత లేని పరీక్షలు నిర్వహించి విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. నాయకులు నిఖిల్, టి. శ్రీనివాస్, దుర్గాప్రసాద్, వంశీ, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

**విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**

**ఆర్మూర్:** పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె సాక్షితో మాట్లాడారు. టీఎస్పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారం కొలిక్కి రాకముందే పదో తరగతి పరీక్ష పత్రాలు లీకు కావడంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కనబడుతుందన్నారు. రాష్ట్ర ప్రజల డిమాండ్ మేరకు సీబీసీఐడీతో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

# నవీపేట్ విండో చైర్మన్‌ను అరెస్టు చేయాలి



సాటాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న హన్మాన్ స్వాములు

**రెంజల్(బోధన్):** హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నవీపేట్ విండో చైర్మన్ అబ్బన్నపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని హనుమాన్ స్వాములు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం సాటాపూర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. హిందువులు ఆరాధ్య దైవంగా భావించే శ్రీరాముడితో పాటు దేవతలను అవమానించిన అబ్బన్న, రాజకీయ లబ్ధికోసం స్వాములను అవమానించడం సిగ్గుచేటన్నారు. నాలుగు రోజులు గడుస్తున్నా ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆయనపై రెంజల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్వాముల ఆందోళనతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి సముదాయించడంతో ఆందోళన విరమించారు. హన్మాన్ దీక్షాపరులు సాయినాథ్ యాదవ్, గోపీకృష్ణ, బీజేపీ నాయకులు మేక సంతోషకుమార్, శివ, రాకేశ్, రాజు, హిందూవాహిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం..

**8న నవోదయ నమూనా పరీక్ష**

**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో ఈ నెల 8న ఉదయం పది గంటలకు నవోదయ నమూన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామగిరి దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 7లోగా తమ వివరాలను పాఠశాలలో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9533302816, 9502275188 నంబర్లను సంప్రదించాలని కోరారు.

**రేపు అభంగపట్నంలో కుస్తీ పోటీలు**

**నవీపేట:** మండలంలోని అభంగపట్నం గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 6న కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు వీడీసీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్రాష్ట్ర కుస్తీ వీరులు ఈ పోటీలలో పాల్గొంటారని, పోటీలకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని వీడీసీ ప్రతినిధులు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# అన్నదాతలను ఆదుకోవాలి



బోధన్‌లో ఆందోళన చేస్తున్న నాయకులు

**బోధన్:** ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం వారు పట్టణంలోని ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో ఆఫీసు ఏవో ముంతాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ. 10 వేలు చెల్లిస్తామంటున్న పంట నష్టపరిహారం ఏమాత్రం సరిపోదని, దీన్ని రూ. 40 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం క్వింటాలుకు రూ.3వేలు మద్దతు ధర చెల్లించాలని పేర్కొన్నారు. రూ.లక్ష పంట రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు పుట్టి నడ్పి నాగన్న, రాజేశ్వర్, ఒడ్డెన్న, పడాల శంకర్, షేక్‌నసీర్, సాయిలు, పోశెట్టి, గంగాధర్, రవి, లక్ష్మణ్, వైద్యనాథ్‌లు పాల్గొన్నారు.

**రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి**

**నందిపేట్ (ఆర్మూర్):** అతివృష్టితో నష్టపోయిన రైతన్నకి నష్టపరిహారం ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ప్రజాపంథా జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం నందిపేట తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో జాప్యం చేయవద్దన్నారు. ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు.

# ఈ-శ్రమ్ కార్డుల పేరిట దందా

- జైతాపూర్‌లో ఆయుష్మాన్ భారత్, ఈ-శ్రమ్ కోసం రూ. వంద వసూలు
- పట్టించుకోని అధికారులు



జైతాపూర్‌లో ఏర్పాటు చేసిన సెంటర్

**ఎడపల్లి(బోధన్):** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలకు కొందరు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. మండలంలోని జైతాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గత కొన్ని రోజులుగా ఆయుష్మాన్ భారత్, ఈ-శ్రమ్ కార్డుల కోసం సీఎస్సీ ఆన్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు దరఖాస్తులు చేసుకోవడానికి క్యూ కడుతున్నారు. కానీ నిర్వాహకులు ఆయుష్మాన్ భారత్ కార్డు ఉచితంగా ఇస్తామంటూనే, ఈశ్రమ్ కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నారు.

**అధికారుల అనుమతి లేకుండానే..**

గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆన్‌లైన్ సెంటర్‌ను జిల్లా అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఏర్పాటు చేశారు. అలాగే రాత్రి వేళ్లలో గ్రామంలో దండోరా వేయిస్తున్నారు. గ్రామంలోని మీ-సేవ సెంటర్‌కు వెళితే ఆయుష్మాన్ భారత్ కార్డు ఉచితంగా ఇస్తూనే ఈ-శ్రమ్ కార్డుకు రూ.25 నుంచి రూ.30 చార్జీలు తీసుకుంటున్నారు. కానీ జీపీలోని సెంటర్ నిర్వాహకులు ఒక్కొక్కరి వద్ద రూ.100 వసూలు చేస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. డబ్బుల వసూలు జిల్లా సీఎస్సీ సెంటర్ నుంచి అధికారికంగా వచ్చినట్లు నిర్వహకులు తెలుపుతున్నారు. దీనిప్రకారమే డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తెలిపారు.

**దరఖాస్తుదారులకు రాని మెసేజ్‌లు..**

ఈ ఆన్‌లైన్ సెంటర్‌లో ఆయుష్మాన్‌భారత్, ఈశ్రమ్‌కు దరఖాస్తులు చేసుకున్న వారికి, వారి ఫోన్లకు మెసేజ్ రావడం లేదు. అలాగే ఫీజు వసూలు చేసినా నిర్వాహకులు రసీదులు ఇవ్వడం లేదు. మండలంలోని తానాకలాన్, కుర్నాపల్లి గ్రామాల్లో కూడా పాన్ కార్డులు ఇంటికి తెచ్చి ఇస్తామంటూ కొంతమంది వ్యక్తులు 15 రోజుల క్రితం దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు తోపాటు రూ.200 నుంచి రూ.300 రూపాయలు వసూలు చేశారు. అయిన దరఖాస్తు దారులకు ఇంత వరకు పాన్‌కార్డులు అందలేవు.

**ఎవరికీ అనుమతి ఇవ్వలేదు..**

గ్రామాలలో ఆన్‌లైన్ కేంద్రాల నిర్వహకులకు ఎలాంటి అనుమతి లేదు. ఆయుష్మాన్‌భారత్, ఈశ్రమ్ కార్డులు తీసుకునేందుకు ఎలాంటి ఆదేశాలు జిల్లా అధికారుల నుంచి అందలేవు. అంతేకాకుండా ఈ కార్డులకు ఎంత రుసుము తీసుకోవాలో స్పష్టత లేదు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సెంటర్‌ల ఏర్పాటుపై ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు.

–గోపాలకృష్ణ, ఎంపీడీవో, ఎడపల్లి

## సంక్షిప్తం

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత**

**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో మంగళవారం పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ సీరడి రాజేశ్వర్ అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు బోగా శ్రీధర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

**వితంతు పింఛన్ల పంపిణీ**

**రుద్రూర్:** చందూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామంలో నూతనంగా ఐదుగురికి మంజూరైన వితంతు పింఛన్లను మంగళవారంసర్పంచ్ బొడ్లాళ్ల సత్యనారాయణ పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ అశ్విని సాయిలు, డీలర్ నర్సింలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**స్పీకర్‌ను కలిసిన పద్మశాలీ సంఘ సభ్యులు**

**రుద్రూర్:** బాన్సువాడలోలో మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని రుద్రూర్ పద్మశాలి సంఘం, ముదిరాజ్ సంఘ సభ్యులు కలిశారు. మండలకేంద్రంలో పద్మశాలి ఫంక్షన్ హాల్ అదనపు పనుల కోసం నిధులు కేటాయించాలని స్పీకర్‌ను కోరారు. రుద్రూర్ విండో మాజీ చైర్మన్ పత్తి రాము, చేనేత సంఘ అధ్యక్షుడు నారాయణ, బీఆర్ఎస్ నేతలున్నారు.

**కల్వర్టుల నిర్మాణానికి భూమిపూజ**



**మోర్తాడ్:** మండలంలోని పాలెం, తిమ్మాపూర్, ధర్మోరాలలో కల్వర్టుల నిర్మాణం కోసం మంగళవారం ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ రవి భూమిపూజ నిర్వహించారు. సర్పంచ్‌లు సంతోష్‌రెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, రాజేశ్వర్, సహకార సంఘం ఛైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి నాయకులు అజారొద్దిన్ పాల్గొన్నారు.

**ఫైలేరియా లింఫాటిక్ సర్వే**

**కమ్మర్‌పల్లి:** మండలంలోని చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లిలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫైలేరియా లింఫాటిక్ సర్వే చేపట్టారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించి, సర్వే చేశారు. వైద్య సిబ్బంది సాయన్న, సుప్రియ, సత్యనారాయణ ఉన్నారు.

**రెంజల్(బోధన్):** రెంజల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం రక్త పరీక్షలు నిర్వహించారు. జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్‌రావ్, ఆరోగ్య విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

**మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం**

**వేల్పూర్:** మండలంలోని అక్లూర్ గ్రామానికి డబుల్‌రోడ్డు మంజూరు చేసినందుకు రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి చిత్రపటానికి గ్రామస్తులు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు నాగధర్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆంగ్లంలో పట్టు సాధించాలి**

**నందిపేట్ (ఆర్మూర్):** ఇంగ్లీష్ భాషపై పట్టుతో ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చు అని సీనియర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగరాజు సూచించారు. నందిపేటలోని సూర్యోదయ హైస్కూల్లో మంగళవారం ఇంగ్లీష్ ఈవెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లంపై తమ ప్రతిభను వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899